క్లుప్తంగా

విగ్రహాలు ఏర్పాటు చేయాలి



పీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాంగణంలో ఆదివాసీ సమరయోధుల విగ్రహాలను ఏర్పాటుచేయాలని కోరుతూ జాతీయ ఆదివాసీ ఐక్యవేదిక ప్రతినిధులు శుక్రవారం ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ గిరిజనులు, వారి హక్కుల కోసం అనేక మంది సమరయోధులు ప్రాణాలను కోల్పోయారని పేర్కొన్నారు. విగ్రహాలను ఏర్పాటు చేసి వారి సేవలను ప్రతిఒక్కరికీ తెలియజేయాలని కోరారు. నాయకులు ఎం కామరాజు, జి.బుచ్చిరాజు, ఎస్ కొయిందయ్య, ఎస్ రాంబాబు, పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

చింతలపూడి : స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజావేదిక ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం ఐదో రోజుకు చేరింది. పాత చింతలపూడి గ్రామంలో ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ, కౌలు రైతు సంఘం నాయకులు ఆర్‌వీ సత్యనారాయణ, డి.సత్యనారాయణ, కంచర్ల గురవయ్య, ముళ్లగిరి లాజరు, తొర్లపాటి బాబు, బోడ వజ్రం, దొంతా కృష్ణ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై నిరసన

కుక్కునూరు: స్మార్ట్ మీటర్ల బిగింపు విధానాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో కుక్కునూరులో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. స్మార్ట్ మీటర్లపై ప్రజల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సీపీఐ కుక్కునూరు మండల సమితి మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, కుక్కునూరు సహాయ కార్యదర్శి కురాకుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టప్రకారం నేరం



శక్తియాప్‌పై అవగాహన కలిగిస్తున్న ఎస్సై

బుట్టాయగూడెం: మండలంలోని రాజానగరం గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహంలో ఎస్సై దుర్గామహేశ్వరరావు శుక్రవారం విద్యార్థినులతో ప్రత్యేక సమావేశ నిర్వహించారు. శక్తియాప్, పోక్సో చట్టం, ఈవ్‌టీజింగ్, యాంటీ ర్యాగింగ్, స్త్రీలు, పిల్లలపై పెరిగే నేరాలపై చట్టపరమైన చర్యలు, తదితర అంశాలపై అవగాహన కలిగించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు, వేధింపులు ఎదురైనా వెంటనే 112కు డయల్ చేయాలని, శక్తియాప్ ద్వారా సమాచారం అందించాలని కోరారు. ర్యాగింగ్ చేసినా, ప్రోత్సహించినా చట్టప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం



బెల్లం ఊటను బయటకు తీస్తున్న సిబ్బంది

కుక్కునూరు: మండలంలోని సారా తయారీ కేంద్రాలపై శుక్రవారం జంగారెడ్డిగూడెం ఎక్సైజ్, కుక్కునూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. తెలంగాణ – ఆంధ్రా సరిహద్దు గ్రామమైన సీతారామనగరంలో వెయ్యి లీటర్ల నిల్వ ఉంచిన బెల్లం ఊట, సారా తయారీలో వినియోగించే ముడి పదార్థాన్ని ధ్వంసం చేశారు. డ్రమ్ములు, ప్లాస్టిక్ ట్యాంకులను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ, విక్రయాలపై 112 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ భోగేశ్వరశ్యామ్, సీఐ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఏలూరు (టూటౌన్): పరిసరాల పరిశుభ్రత ద్వారా వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పీజే అమృతం అన్నారు. స్థానిక గజ్జల వారి చెరువు పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న తోటకూర దొడ్లు 1, 2, 3 సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని ఆమె శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అపరిశుభ్ర పరిసరాల వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులు సంభవించే అవకాశం ఉందని ప్రజలకు వివరించారు.

కూటమి పాలనపై అసంతృప్తి

- హామీల అమలులో విఫలం
- వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజయరాజు



కామవరపుకోట పాతూరులో మాట్లాడుతున్న విజయరాజు

కామవరపుకోట: ఏడాది కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలనతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. శుక్రవారం మండలంలో కామవరపుకోట, రావికంపాడు గ్రామాల్లో మండల కన్వీనర్ రాయాంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీయాలన్నారు. హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ నాయకులనే టార్గెట్‌గా అక్రమ కేసులు పెడుతూ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ రాష్ట్రంలోఅలజడులు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులను దగా చేశారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకుండా రైతులను ఆర్థికంగా అప్పులు పాలు చేశారని ఆరోపించారు. ఉచిత బస్సు అంటూ మహిళలను మోసం చేశారని, ఈ మోసాలపై ప్రతి రైతు, ప్రతి మహిళ గమనించాలని కోరారు. కూటమి నాయకులు గ్రామాల్లోకి వస్తే హామీలు నెరవేర్చే విధంగా వారిని నిలదీయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, దేవరపల్లి రామ్మోహన్‌రావు, సాయన కనకరాజు, నానాది సాగర్, గుర్రాల రవికుమార్, కనుమూరు అంజిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, మెరుగు బాబురావు, షేక్ మీరా సాహెబ్, మోహన్ రావు, మద్ది రామయ్య, మేడంకి చిన్న, ఎంపీటీసీలు తమ్మిశెట్టి గిరిజ, మేడంకి పద్మ, బొల్లు వెంకట సత్యనారాయణ, వాసే ఆనంద్, డాక్టర్ గణేష్, వెంకటేష్, కృష్ణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కొమరం భీంకు నివాళి



కొమరం భీంకు నివాళులర్పిస్తున్న నాయకులు

కుక్కునూరు: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం కుక్కునూరు మండలం ఎర్రపాడు గ్రామంలో ఆదివాసీ దినోత్సవాలను ప్రారంభించారు. పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూరం సంజీవరావు, డివిజన్ ప్రచార కార్యదర్శి పొడియం వేణుగోపాల్‌లు ఆదివాసీ నాయకుడు కొమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ జెండాను ఎగరవేశారు. ఈనెల 9న నిర్వహించే ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు.

లబ్ధిదారుల కుటుంబానికి అండగా పింఛన్



26వ వార్డులో పింఛన్ అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి



రామచంద్రపురంలో పింఛన్ అందిస్తున్న చంద్రరావు

జంగారెడ్డిగూడెం: దివంగత వైఎస్సార్ ప్రవేశపెట్టిన పింఛన్ విధానాన్ని ప్రతి ప్రభుత్వం కూడా కొనసాగిస్తుందని, ప్రతి కుటుంబానికి పింఛన్ అండగా ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక 26వ వార్డు 9వ సచివాలయం పరిధిలో స్పాట్ పింఛన్ ఇచ్చామని తెలిపారు. పింఛన్ రూ.4 వేలు ఇవ్వడంతో కుటుంబంలో పెద్ద కొడుకులా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అయిన చిటికెల అచ్యుతరామయ్య, లోకారపు వెంకటేశ్వరరావు, చింతకాయల అచ్చిరాజు, నవ్వుడు శివ, భీమిరెడ్డి జోగిబాబు, కురిపురి రాంబాబు, తమ్మటాని నారాయణ, నక్కా రవి, గాది గోవిందు, కండిపల్లి శ్రీను, కాళిదాసు శ్రీను, డోకల సాంబమూర్తి, నౌడి పెద్ది నాయుడు, బొచ్చ వెంకట నాయుడు, పైలా లక్ష్మణరావు, బేతా తాతబాబు పాల్గొన్నారు.

ఇంటింటికీ పింఛన్ జగన్ ఘనతే

జంగారెడ్డిగూడెం: గత ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్ అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని 13వ వార్డు కౌన్సిలర్ పీపీఎన్ చంద్రరావు అన్నారు. శుక్రవారం పలు వార్డుల్లో లబ్ధిదారులకు ఆయన పింఛన్లు అందజేశారు. కూటమి ప్రభుత్వం అవ్వాతాతలకు అన్యాయం చేస్తోందని, కొత్తగా ఇవ్వాల్సిన పింఛన్లకు కోతలు పెడుతోందని చంద్రరావు ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 12, 13, 14 వార్డు కమిటీల అధ్యక్షులు రవి, రామకృష్ణ, కొండ్రెడ్డిరాము, పార్టీ సచివాలయం ఇన్‌చార్జి గూడపాటి రాధాకృష్ణ, రఫీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి



తల్లి పాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ బ్యూల

జంగారెడ్డిగూడెం: బిడ్డ పుట్టిన అర గంటలోపు తల్లిపాలు బిడ్డకు పట్టడం ద్వారా బిడ్డకు సహజ వ్యాధి నిరోధకశక్తి, బలమైన పౌష్టికాహారం, మానసిక ఆరోగ్య బిడ్డకు వస్తుందని సీడీపీఓ పి.బ్యూల తెలిపారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం 9వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రం – 75లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లలకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా ఉంటాయని, తల్లి – బిడ్డకు అనుబంధం పెరుగుతుందని వివరించారు. ప్రతి నెలా మొదటి శుక్రవారం ఫేస్‌యాప్ ఇచ్చే టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేశారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వారం రోజుల వ్యవధిలో రెండు రోజులు సామాజిక వేడుకలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త ఎ.జగదీశ్వరి, వైద్య సిబ్బంది ఎంపీహెచ్‌ఓ మంజునాథ, కనకరత్నం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష గాజుల అలంకరణలో అమ్మవార్ల దర్శనం



నూకాలమ్మ



వాసవి కన్యకాపరమేశ్వరి

జంగారెడ్డిగూడెం: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా స్థానిక శ్రీ నూకాలమ్మ ఆలయంలో అమ్మవారు లక్ష గాజుల అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆర్డీఓ ఎల్ దేవకీదేవి దర్శించుకున్నట్టు ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 8న అమ్మవారు స్వర్ణ వర్ణ పూర్ణ కవచాలంకరణలో దర్శనమిస్తారని తెలిపారు. ఉదయం వరలక్ష్మీ వ్రత పూజలు, సాయంత్రం 4 గంటల నుంచి శ్రావణ రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ యాగశాలలో లోక కళ్యాణార్థం 78వ చండీ హోమం నిర్వహిస్తామని తెలిపారు.

ముత్యాలమ్మవారికి అభిషేకాలు

జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మ ఆలయంలో ఉత్సవ విగ్రహానికి లఘున్యాసపూర్వకంగా పంచామృత ఏకవార రుద్రాభిషకాలు అర్చకులు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి మూల విరాట్‌కు 27 నక్షత్ర కుంభ సూర్య చంద్ర నక్షత్ర గజ వృషభ సింహ హారతులిచ్చారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

లక్ష గాజుల లంకరణ

జంగారెడ్డిగూడెం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి లక్ష గాజుల అలంకరణ చేశారు. శుక్రవారం అమ్మవారికి పసుపు, కుంకుమలతో మహిళలు వందలాది మంది తరలివచ్చి దర్శించుకుని ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం 800 మందికి కర్పూరం నారాయణరావు కుటుంబ సభ్యులు అన్నదానం చేశారని కమిటీ సభ్యులు తెలిపారు.


ఆలయాల్లో భక్తుల సందడి



హరితాళ అలంకరణతో కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం: శ్రావణ శుక్రవారం సందర్భంగా కనకదుర్గమ్మ ఆలయాలతో పాటు వివిధ అమ్మవార్ల ఆలయాలు, గ్రామ దేవతల ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. వై.జంక్షన్ ఆలయంలో శ్రీ కనకదుర్గమ్మను అర్చకులు లక్ష్మణ శర్మ హరితాళ (పసుపు కొమ్ములు) అలంకరణతో సుందరంగా అలంకరించి విశేష పూజలు చేశారు. గవరవరంలోని శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు. కొయ్యలగూడెం చింతలమ్మ ఆలయం వద్ద సామూహిక లలితా సహస్ర నామ పారాయణం చేశారు. టెంపుల్స్ సెంటర్లోని వాసవి కన్యకా పరమేశ్వరి శ్రీ చక్ర సహిత కనక దుర్గమ్మ శ్రావణమాస పూజలు అందుకున్నారు.

నమో.. నారసింహా





నారసింహుని మూలవిరాట్‌కు అభిషేకం చేస్తున్న పండితులు, స్వామివారిని దర్శిస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని అర్చకులు, పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన చేశారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ సుదర్శన నారసింహ ధన్వంతరీ గరుడ ఆంజనేయ అనంత సుబ్రహ్మణ్య మూలమంత్ర హోమాలు, అనంతరం మహా పూర్ణాహుతి వేడుక వైభవంగా నిర్వహించారు. గర్భాలయంలోని స్వామివారి మూలవిరాట్‌కు విశేష పంచామృతాభిషేకాలు, నక్షత్ర హారతులు, నీరాజన మంత్రపుష్పాలను సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఆవరణలో భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడని పోలీస్ స్టేషన్ రైటర్ టి.బాబూరావు తెలిపారు. గత నెల 27న కోటగిరి సత్యనారాయణ స్థానిక త్రివేణి కాలేజీ సమీపంలో రోడ్డుపై వెళుతుండగా వేగవరానికి చెందిన టి.చినరాజు మోటారుసైకిల్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడన్నారు. సత్యనారాయణను విజయవాడ ఆసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. సత్యనారాయణ సోదరుడు ప్రసాదు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వేగవరానికి చెందిన ఒక వివాహితను తెలంగాణలోని ఉప్పాక గ్రామానికి చెందిన జి.పద్మరాజు ఫోన్‌లో వేధింపులకు గురిచేస్తున్నాడన్నారు. శుక్రవారం ఆమెకు ఫోన్ చేసి ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిత్రహింసలకు గురిచేశారంటూ ధర్నా

ఏలూరు (టూటౌన్): అకారణంగా కట్టేసి కొట్టి చిత్రహింసలకు గురిచేసిన వ్యక్తులను అరెస్ట్ చేశాలని, తలారి ప్రకాష్‌పై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. బాధితుడు ప్రకాష్ మాట్లాడుతూ కామవరపుకోట మండలం జోగడగూడెంలో తాను నివాసం ఉంటూ పదేళ్ల నుంచి రైస్ మిల్లు స్థలం లీజుకు తీసుకొని సిమెంట్ తూరలు తయారు చేస్తున్నానని తెలిపారు. తన స్థలంలో కొందరు ఆకతాయిలు గంజాయి మద్యం సేవిస్తున్నారని, దీంతో స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేస్తుండగా అదే గ్రామానికి చెందిన 12 మంది అకారణంగా దాడి చేసి కొట్టారని వివరించారు. కులం పేరుతో దూషించారని తెలిపారు. తనపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు మామిడి రూపశంకర్ పాల్గొన్నారు.

ఏలూరు రైల్వే స్టేషన్‌కు మహర్దశ

- అమృత్ స్టేషన్ అభివృద్ధి పథకంలో చకచకా పనులు
- రూ.21.10 కోట్ల నిధుల కేటాయింపు
- చాలా వరకు పనులు పూర్తి



స్టేషన్‌లో కొత్తగా నిర్మించిన ప్లాట్ ఫాం, షెడ్



రైల్వే స్టేషన్ లోపల కూర్చునేందుకు ఏర్పాటు చేసిన స్టీల్ చైర్లు





వెయిటింగ్ హాల్ భవనం, వెయిటింగ్ హాల్‌లో ఉన్న వెస్ట్రన్ టాయిలెట్స్, వాష్ బేసిన్



రైల్వే స్టేషన్ మెయిన్ ఎంట్రన్స్ (ఫైల్)

ఏలూరు (టూటౌన్): దక్షిణమధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో ఒక్కటైన ఏలూరు రైల్వేస్టేషన్ కొత్త హంగులను సంతరించుకుంటోంది. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో ఏడాది క్రితం ఎంపికయిన ఏలూరు స్టేషన్ అభివృద్ధికి రూ.21.10 కోట్ల నిధులు కేటాయించారు. వీటితో చేపట్టిన పనులు చకచకా సాగిపోతున్నాయి. వెయిటింగ్ హాల్, ఏసీ వెయిటింగ్ హాల్, వెస్ట్రన్ స్టైల్లో బాత్ రూమ్‌లు, వాష్ బేసిన్లు తదితర సౌకర్యాలు కల్పించారు. ప్లాట్ ఫారంపై అదనపు షెడ్ నిర్మాణంతోపాటు ఫ్లోరింగ్‌ను టైల్స్‌తో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఈ స్టేషన్ మీదుగా నిత్యం 61 రైలు సర్వీసులు నడుస్తున్నాయి. అడపాదడపా ప్రత్యేక రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. రోజుకు ఆరు వేల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు చేస్తున్నారు.

ముఖ్య పట్టణాల్లో ఒకటి

రాష్ట్రంలోని ముఖ్యమైన పట్టణాల్లో ఏలూరు ఒకటి. కొత్త జిల్లాకు కేంద్రంగా ఉన్న ఏలూరు పేరు చెబితేనే గుర్తుకు వచ్చేది తివాచీ పరిశ్రమ. ఏలూరుకు ఇటు భౌగోళికంగా, అటు చారిత్రాత్మకంగా, వివిధ రంగాల్లో గుర్తింపు ఉంది. ఆక్వా పరిశ్రమ అభివృద్ధి చెందుతుండటంతో ఏలూరు రైల్వేస్టేషన్ నుంచి ఎగుమతులకు వెసులుబాటు కలుగనుంది. ఇప్పటికే ఏలూరు రైల్వే స్టేసన్ నుంచి ప్రతి నెలా పెద్ద ఎత్తున ఎఫ్‌సీఐ ద్వారా బియ్యం ఎగుమతులు కొనసాగుతున్నాయి.

ఉత్తమ శ్రేణి స్టేషన్‌గా రూపాంతరం

ఈ రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారంతో పాటు ప్రాంగణం, ట్రాఫిక్ వసతులు, వెయిటింగ్ గదులు, ప్రయాణికులకు అనువుగా ఉండే సమాచార సూచికలు వృద్ధి చేయనున్నారు. రైల్వే స్టేషన్ల సదుపాయాల పరంగా నూతనత్వంతో ఉత్తమ శ్రేణి రైల్వే స్టేషన్‌గా ఏలూరు స్టేషన్ రూపాంతరం చెందనుంది.

ప్రయాణికుల హర్షం

ఏలూరు స్టేషన్ భౌగోళికంగా ఇటు మెట్ట, అటు డెల్టా ప్రాంతాలకు కీలక కేంద్రంగా ఉంది. ఆక్వా, వరి, ఉద్యాన, వాణిజ్య పంటల ఎగుమతులు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇంతటి కీలకమైన స్టేషన్‌ను అభివృద్ధి చేయనుండటం పట్ల ఈ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వందే భారత్ లాంటి రైళ్లను, విశాఖపట్టణం నుంచి వచ్చే రైలుకు హాల్టు ఇచ్చారు. హైదరాబాద్ నుంచి వచ్చి, వెళ్లే సర్వీస్‌కు ఒక్క సర్వీస్‌కే హాల్టు ఇవ్వడం వల్ల ఏలూరు కేంద్రంగా రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

మరింత ప్రయోజనం



అమృత్ భారత్ స్టేషన్ పథకంలో ఏలూరు రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక ప్రజలు, వ్యాపారులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. ఇటు ప్రయాణికులకు ప్రయోజనంతోపాటు అటు రైల్వే శాఖకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. నిధులు కేటాయించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు.

– నాగం శివ, మాజీ డీయూఆర్‌సీసీ సభ్యుడు, ఏలూరు

మారిపోతున్న రూపురేఖలు



ఏలూరు స్టేషన్‌లో రూ.21.10 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు చాలా వరకు పూర్తయ్యాయి. స్టేషన్ ముఖ ద్వారం, ప్లాట్ ఫారంలకు సంబంధించి సాంకేతిక సిబ్బంది, అధికారులు సర్వే చేశారు. ప్రయాణికులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా రైల్వే శాఖ చర్యలు తీసుకుంది. అభివృద్ధి పనులు మొత్తం పూర్తయితే ఏలూరు స్టేషన్ రూపు రేఖలు మారిపోనున్నాయి.

– ఎన్‌వీ రమేష్, రైల్వే స్టేషన్ మేనేజర్

కుంకుళ్లమ్మకు ప్రత్యేక పూజలు



కుంకుళ్లమ్మవారు

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని, పరిసరాలను సుగంధ భరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం గర్భాలయంలో కొలువైన అమ్మవారికి అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో కుంకుమ పూజలు చేశారు. ఆలయ యగశాలలో అర్చకులు, పండితులు చండీ హోమం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారిని దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శ్రావణ మూడో శుక్రవారం అమ్మవారిని దర్శిస్తే సకల సౌభాగ్యం, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని పండితులు చెబుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: మండలంలోని నిమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గృహ, వ్యవసాయ, కమర్షియల్, అన్నిరకాల సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కట్టపాదులగూడెం, టెక్కినవారిగూడెం గ్రామాలకు 3 ఫేజ్ 24 గంటల లైన్ వేసే నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పోలవరం డివిజన్

90102 23729

70754 60815

Office mail : tpgadvt@gmail.com